క్లుప్తంగా

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): నగర ప్రజలందరికీ తెలుగు వారి తొలి పండుగ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉగాది పండుగ ప్రకృతి పండుగని, జీవితం సకల అనుభూతుల మిశ్రమమని పేర్కొన్నారు. అదే ఉగాది పచ్చడి ద్వారా తెలియజేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు భగవంతుడు ప్రసాదించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తి కావడంతో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తెలంగాణాకు వెళ్లిపోయినందున ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు దూర విద్యార్హత కోల్పోయారని ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే అమరావతిలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ ఈ విషయంలో స్పందించి వెంటనే ఉత్తర్వులు ఇచ్చేలా చూడాలన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీకి స్థలం కేటాయించి నిర్మాణం ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీఎన్‌బీఎస్‌కు కుర్చీల బహూకరణ



బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల సౌకర్యార్థం పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు 11 త్రీ సీటర్ కుర్చీలను బహూకరించారు. ఈ మేరకు శనివారం పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్ సిన్హా, చీఫ్ మేనేజర్లు ఉదయ్‌కుమార్, నరసింహారెడ్డిలు బస్‌స్టేషన్ అధికారులకు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం, ఎన్టీఆర్ జిల్లా డీపీటీఓ ఏసుదానం, డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ నర్రా శ్రీనివాసరావులు పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యార్థులు ఐఓటీపై పట్టు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కంప్యూటర్ రంగ విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై పట్టు సాధించాలని స్మార్ట్ హోం అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్.ప్రదీప్‌కుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో 'స్మార్ట్ బిల్డింగ్ యూజింగ్ ఐఓటీ' అంశంపై నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సెన్సార్స్ ద్వారా వచ్చే ఖచ్చితమైన సమాచారాన్ని క్లౌడ్ డేటా బేస్‌లో స్టోర్ చేసి దానిని ఏ విధంగా అప్లికేషన్‌కు అనుగుణంగా మార్చు చేయాలో విద్యార్థులకు వివరించారు. ఐఓటీ ద్వారా రానున్న కాలంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. ఐఓటీ వినియోగంతో సమాజానికి ఏ విధమైన ఉపయోగాలు కలుగుతాయో తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఐ.మురళీకృష్ణ, అధ్యాపకులు నిఖిత, వీఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వారిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అత్త, భర్త సోదరులు వేధిస్తున్నారంటూ ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యాధరపురం యద్దనపూడి వారి వీధికి చెందిన సాలపు సౌహిరా భాను 2002వ సంవత్సరంలో వినయ బాల మురళీకృష్ణ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. 2019లో ఆమె భర్త చనిపోయాడు. అప్పటి నుంచి అత్త నాగమల్లేశ్వరి, భర్త సోదరులు నరేంద్ర కుమార్, లక్ష్మణ ప్రసాద్, చిన్న మామ సన్యాసిరావు ఆమెను వేధింపులకు గురిచేస్తున్నారు. భర్త వాటా ఆస్తి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు. ఆస్తి పేపర్లు ఇవ్వమని అడగ్గా.. ఆస్తి ఇచ్చేది లేదంటూ బెదిరించారు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పశ్చిమంలో ఉగాది సందడి

- ముస్తాబైన ఆలయాలు
- కిటకిటలాడిన ప్రధాన కూడళ్లు



కేజీ మార్కెట్ సెంటర్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలు శనివారం మధ్యాహ్నం నుంచి సందడిగా దర్శనమిచ్చాయి. ఉగాది పర్వదినం రోజున వినియోగించే పూజా సామగ్రి, ఉగాది పచ్చడి సామగ్రి అమ్మకాలతో బిజీబిజీగా కనిపించాయి. ముఖ్యంగా మామిడి తోరణాలు, వేప పూత, మామిడికాయల అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ సందర్భంగా కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, మెయిన్‌బజారు, శివాలయం వీధి, సామారంగంచౌక్, కేటీరోడ్డు తదితర ప్రాంతాలలో నగర సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఆయా సామగ్రిని విక్రయించారు. పాతబస్తీలోని కిరాణా దుకాణాలతో పాటు ఆయా ప్రధాన కూడళ్లు వ్యాపారులతో కళకళలాడుతూ కనిపించాయి. అదేవిధంగా వస్త్రలత, ఇతర వస్త్ర దుకాణాలలో విక్రయాలు కూడా భారీగా జరిగాయి.

ముస్తాబైన ఆలయాలు..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. ఉగాది పండుగ రోజున ఉదయం ఆలయాల్లో మూలవిరాట్‌లకు అభిషేకాలు, అనంతరం పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆలయాలను పూలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. వాటితో పాటుగా ఆలయంలోని ప్రధాన ప్రాంగణాలన్నింటినీ ముస్తాబు చేశారు. పాతబస్తీలోని కెనాల్‌రోడ్డు వినాయకుని దేవస్థానం, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం), బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, కొత్తగుళ్ల ప్రాంగణంలోని వివిధ ఆలయాలు పండుగకు ముస్తాబయ్యాయి.



ముస్తాబైన కెనాల్‌రోడ్డు వినాయకుని దేవస్థానం

దస్త్రాల పుస్తకాలకు గిరాకీ

ఉగాది రోజున చాలా మంది దుకాణాదారులు తమ వ్యాపారానికి సంబంధించి పుస్తకాలతో పూజలు నిర్వహిస్తారు. దస్త్రంగా పిలుచుకునే ఈ పూజలకు వివిధ రకాల అకౌంట్ పుస్తకాలను కొనుగోలు చేస్తారు. ఆ విధమైన పుస్తకాలను విక్రయించే పాతబస్తీలోని దుకాణాలు సైతం కిటకిటలాడుతూ కనిపించాయి.

పండగ వేళ పూలకు గిరాకీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉగాది పర్వదినానికి వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ పూలమార్కెట్ వినియోగదారులతో శనివారం కిక్కిరిసింది. ఆదివారం పండుగను పురస్కరించుకొని పూజలకు, ఇతర అలంకరణ నిమిత్తం పూలను తీసుకెళ్లేందుకు నగర వాసులు భారీగా మార్కెట్‌కు తరలివచ్చారు. కృష్ణా మెయిన్ కెనాల్ సమీపంలోని హోల్‌సేల్ పూలమార్కెట్ రద్దీగా దర్శనమిచ్చింది. బంతి, చామంతి, మల్లి, లిల్లీ, గులాబీ పూలు భారీగా వచ్చాయి. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం రోడ్డు మొత్తం వినియోగదారులు, వాహన చోదకులతో కిక్కిరిసిపోయి ట్రాఫిక్ స్తంభించింది.

పూలదండలకు డిమాండ్

మార్కెట్‌లో పూలదండలకు గిరాకీ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆలయాలు, ఇళ్లలో దేవుని విగ్రహాలతో పాటుగా అలంకరణకు దండలు వినియోగిస్తారు. దస్త్రాలు ఉన్న దుకాణాదారులు సైతం భారీగా పూలదండలను తీసుకెళ్లారు. అదేవిధంగా పండుగ సందర్భంగా వివిధ సభా కార్యక్రమాలను నిర్వహించే సంస్థలు సైతం దండలకు ఆర్డర్లిచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. వీటి ధరలు రూ.200 నుంచి రూ.వెయ్యి వరకూ పలికాయి.

పెరిగిన పూల ధరలు

పండగ సందర్భంగా పూల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. రెండు రోజుల క్రితం ఉన్న ధరలు రెట్టింపయ్యాయి. ధర చూసి వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. ప్రధానంగా మొన్నటి వరకూ కనకంబరాలు కిలో రూ.200 పలకగా శనివారం ఉదయం రూ.400, సాయంత్రానికి రూ.600 వరకు ధర పలికింది. మల్లెపూలు మొన్నటి వరకూ కిలో రూ.200 మాత్రమే ఉండగా శనివారం రూ.800 దాటింది. వాటితో పాటుగా చామంతి, గులాబి ధరలు సైతం నాలుగు రెట్లు పెరిగి మూడువందలకు చేరుకున్నాయి. లిల్లీ మొన్నటి వరకూ రూ.100 ఉండగా శనివారం రెండు నుంచి మూడు వందలు వినిపించింది. పూల ధరలు హోల్‌సేల్ మార్కెట్‌లో ఇలా పలుకుతుంటే రిటైల్‌గా ఇళ్ల వద్ద ఆ ధరలు మరింత పెరిగి వినియోగదారులకు మరింత భారమయ్యాయి.



రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో భారీ రద్దీ

కేబీఎన్‌లో ఉగాది వేడుకలు



సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు సంప్రదాయాలను ఆవిష్కరించే వస్త్రధారణ, కవితాగానాలు, ఉగాది గీతాలాపనలతో కేబీఎన్ కళాశాలలో ఉగాది వేడుకలు శనివారం సాయంత్రం సందడిగా సాగాయి. ఆ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. తెలుగు ప్రాంతాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుపుకునే ఉగాది వేడుకలను ఆ ప్రాంత వస్త్రధారణతో విద్యార్థులకు ఆకట్టుకునేలా ప్రదర్శించారు.

ఆచారాలకు ప్రతీక ఉగాది..

కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి, ఆచారాలకు ఉగాది పండుగ ప్రతీకగా నిలుస్తోందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కాలాన్ని ఆధారంగా చేసుకుని భారతీయ ఖగోళ విజ్ఞానవేత్తలు వేల ఏళ్ల క్రితం చేసిన కృషికి ఉగాది సంకేతంగా నిలుస్తోందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని ఉమెన్ స్టడీస్ సెంటర్ సమన్వయకర్త వి.శ్రీదేవి, వనమాదేవి, స్వాతి నిర్వహించారు.

రంజాన్ ప్రత్యేకం.. సేమ్యా



వించిపేటలో తయారీ కేంద్రం వద్ద ఆరబెట్టిన సేమ్యా



పంజా సెంటర్‌లో విక్రయిస్తున్న సేమ్యాలు

- వించిపేటలో ప్రత్యేకంగా తయారీ కార్ఖానాలు
- అందుబాటులో వివిధ రకాల సేమ్యాలు
- పాతబస్తీలో విస్తృతంగా అమ్మకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ అనగానే అందరికీ గుర్తుకు వచ్చే తీపి వంటకం షీర్‌ఖుర్మా. రంజాన్ పర్వదినం రోజున ప్రతి ముస్లిం ఇంట సేమియాతో చేసే ఈ వంటకం తప్పనిసరి. పండుగ రోజున ముస్లిం సోదరులు తమ ఆత్మీయులకు, బంధువులకు, స్నేహితులకు సేమ్యాతో చేసిన షీర్‌ఖుర్మాను అందజేస్తారు. అంతేకాకుండా తమ దగ్గర ఆత్మీయులకు రంజాన్ సందర్భంగా సేమ్యాను అందజేసి తమ ఆనందాన్ని పంచుకుంటారు. అందుకోసం పండుగ సమీపిస్తున్న వారం పది రోజులు ముందుగానే సేమ్యా తయారీకి సన్నద్ధమవుతుంటారు. అందులో భాగంగానే ఒక్కొక్క ముస్లిం ఇంట కనీసం ఐదు నుంచి పది కిలోల మేర సేమియాను తయారు చేయిస్తుంటారు.

వన్‌టౌన్‌లోని సేమ్యా తయారీ కేంద్రాలు

వన్‌టౌన్, వించిపేట తదితర ప్రాంతాల్లో సేమ్యా తయారీ కేంద్రాలు ఏడెనిమిది వరకూ ఉన్నాయి. రంజాన్ మాసంలో ఆ సేమ్యా తయారీ కేంద్రాలన్నీ ఉదయం నుంచి రాత్రి వరకూ బిజీబిజీగా దర్శనమిస్తుంటాయి. అంతేకాకుండా కొంతమంది ఇళ్ల వద్ద సేమ్యా తయారీ యంత్రాలు కూడా ఉండటంతో వారే స్వయంగా సేమ్యా తయారు చేస్తుంటారు. ముస్లింలు గోధుమలను శుభ్రం చేసి పిండి ఆడించి గోధుమపిండిని సిద్ధం చేసుకుంటారు. తిరిగి దానిని శుభ్రపరచి సేమ్యా తయారీ కేంద్రానికి చేరుస్తారు. అక్కడ తయారు చేసే సిబ్బంది ఆ పిండిని యంత్రంలో వేసి సేమ్యా తీస్తారు. తరువాత తయారైన సేమ్యా ఆరుబయట గాలి ఆడే విధంగా ఆరబెడతారు. ఇది చూడటానికి చాలా ఆసక్తిగా ఉంటుంది. ఒకవైపు ఆధునికత వైపు పరుగులు తీస్తూ సంప్రదాయాలను పక్కనపెడుతున్న ప్రస్తుత కాలంలో ఇంకా సేమియా తయారీలకు ముస్లిం సోదరులు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. బయట రకరకాల సేమియాలు విభిన్న రుచుల్లో అందుబాటులో ఉన్నా వాటిని తీసుకోవడానికి ఇష్టపడరు. చాలా కొద్దిమంది మాత్రమే అటుగా అడుగులు వేస్తారు. అయితే చాలా మంది ముస్లింలు ఇలా స్వయంగా సేమ్యా తయారు చేయించుకొని వినియోగిస్తారు. రంజాన్ పండుగను చాలా చక్కగా జరుపుకుంటారు. షీర్‌ఖుర్మాతో పాటుగా సేమియాతో అనేక వంటకాలు చేసి తమ మిత్రులకు అందజేసి తమ సంతోషాన్ని పంచుకుంటారు.

అందుబాటులో విభిన్న రకాల సేమ్యాలు

సేమ్యాల్లోను విభిన్న రకాలు అందుబాటులో ఉన్నాయి. రెడీమేడ్‌గా తయారు చేసే తో పాటుగా తెలంగాణ, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి సైతం నగరానికి తీసుకొచ్చి విక్రయాలు చేస్తుంటారు. వాటి ధరలు నాణ్యత, ప్రత్యేకతలను బట్టి విక్రయాలు చేస్తుంటారు. సాధారణంగా వన్‌టౌన్‌లో ముస్లిం సోదరులు తమకు ఆత్మీయులైన హిందువులకు తప్పనిసరిగా ఈ వంటకాన్ని లేదా సేమియాను అందజేయడం అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. అలాగే మత సామరస్యానికి ఇటువంటి ఆత్మీయ పలకరింపులు వారి మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందంటారు ఇక్కడి స్థానిక నివాసితులు. సేమ్యా కూడా మత సామరస్యానికి ఒక సాధనంగా రూపుదాల్చడం ఒక విశేషం.

దుర్గమ్మ సన్నిధిలో నేటి నుంచి వసంత నవరాత్రోత్సవాలు

- ఆరో అంతస్తులో పంచాంగ శ్రవణం
- సాయంత్రం వెండి రథోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. విశ్వావసు నామ సంవత్సరాది వేడుకలు, వసంత నవరాత్రోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి తెల్లవారుజామున స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. స్నపనాభిషేకం నేపథ్యంలో ప్రతి రోజు తెల్లవారుజామున జరిగే పలు ఆర్జిత సేవలను రద్దు చేయడంతో పాటు మరి కొన్ని సేవల సమయాన్ని మార్పు చేస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

9 గంటలకు అమ్మవారి దర్శనం, ఆర్జిత సేవలు

తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం నేపథ్యంలో సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ సేవ, ఖడ్గమాలార్చన, రుద్రహోమం సేవలను దేవస్థానం రద్దు చేసింది. ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనాలు ప్రారంభం కావడంతో పాటు అదే సమయానికి లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, శ్రీచక్ర నవార్చన, చండీహోమం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు ప్రారంభం కానున్నాయి.

నూతన పూజా మండపంలో పుష్పార్చన

వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని 9 రోజుల పాటు అమ్మవారికి విశేష పుష్పార్చన నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పూజా మండపాలలో ఈ విశేష పుష్పార్చన నిర్వహించేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. ఇక మహా మండపం ఆరో అంతస్తులో దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాసశర్మచే పంచాంగ శ్రవణం జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు వెండి రథంపై ఊరేగిస్తారు. ఆదిదంపతులు వెండి రథంపై కొలువు తీరి నగర పుర వీధుల్లో విహరిస్తారు.

ఒలింపిక్, నాన్ ఒలింపిక్ క్రీడాకారులకు సమన్యాయం చేయండి

ఒలింపిక్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.పి.రావు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలోని ఒలింపిక్, నాన్ ఒలింపిక్ క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగ, పారితోషకాల్లో సమన్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (రిజిస్టర్ నంబర్: 175/1961) డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు శనివారం ఆయన రాసిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 64 క్రీడలను గుర్తించినప్పటికీ వీటిల్లో ఉన్న 28 నాన్ ఒలింపిక్ క్రీడాకారులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. ఒలింపిక్ క్రీడాకారులకే గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తామనటం సమంజసం కాదని తెలిపారు. దీని వల్ల సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో తదితర క్రీడాంశాల క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్రీడా పాలసీలో క్లారిటీ లేదని, క్రీడల అభివృద్ధికి సంబంధించిన జీఓలు విడుదల చేయకుండా క్రీడలను అభివృద్ధి చేస్తామని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోడ్ ప్రకారం 490, 272 జీవోలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సంఘాల మధ్య నెలకొన్న వివాదాలు పరిష్కరించాలని, క్రీడా సంఘాల అవినీతిలో సీఐడీ, ఏసీబీతో విచారణ జరిపించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పర్మినెంట్ వీసీ, ఎండీని నియమించాలని డిమాండ్ చేశారు. క్రీడా సమస్యలను పరిష్కరించకపోతే శాప్ కార్యాలయం ముందు ఒక రోజు నిరాహార దీక్ష చేపడతానన్నారు. అప్పటికీ ప్రభుత్వంలో కదలిక రాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

శ్రీనగరాల సంఘం నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఎన్వీ రావు తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సమాజ సేవ చేయాలనే సంకల్పం ఉన్న యువతరంలో నాయకత్వం పెంచడానికి శ్రీనగరాల సంఘం ఎంతో దోహదపడుతుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీ రావు పేర్కొన్నారు. శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశం శనివారం కేఎల్‌రావు నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా నగరాల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎన్వీ.రావు, అధ్యక్షుడిగా నల్లాని సూర్యారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాయన శేఖర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పిళ్లా రవి, మరుపిళ్ళ రాజేష్, పోతిన శ్రీనివాసరావు, తమ్మిన విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మజ్జి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొరగంజి భాస్కరరావు, ఎన్ఎస్ఆర్‌లతో పాటు వివిధ జిల్లాలకు చెందిన పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సంఘం ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులకు పురస్కారాలను అందజేయాలని నిర్ణయించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న నిర్వహించే ఉగాది పురస్కారాలు - 2025 అందించేందుకు వివిధ విభాగాల్లో ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యం, సాహిత్యం సంగీతం , కళలు, క్రీడలు, నృత్యం, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, నాటక, సినీ, టీవీ తదితర రంగాల్లో సేవలందిస్తున్నవారు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పురస్కారాల ఎంపిక కోసం వారి సేవలు, ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుతోపాటు జతచేసి ఏప్రిల్ 5వ తేదీ లోగా అకాడమీ కార్యాలయానికి పంపాలన్నారు. పురస్కారానికి ఎంపికయిన ప్రతిభావంతులకు వచ్చేనెల 13న హైదరాబాద్‌లో ప్రముఖుల చేతులమీదుగా పురస్కారంతో సత్కరించనున్నట్లు తెలిపారు. 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అల్పాహారం అందించిన దాతలకు సత్కారం



వాసవీ క్లబ్ భవానీపురం సభ్యులను సత్కరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు 45 రోజుల పాటు సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించిన దాతలకు(వాసవీ క్లబ్ భవానీపురం సభ్యులు) పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. అల్పాహారం అందించటం ముగియటంతో హైస్కూల్‌లో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ భవానీపురం సభ్యులు అందించిన సహకారం కారణంగా విద్యార్థులు బయటకు వెళ్లి టిఫిన్ తినే సమయం కలిసి వచ్చిందని, ఆ సమయాన్ని చదువు కోసం కేటాయించటం జరిగిందన్నారు. క్లబ్ అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అల్పాహారంతో పాటు ఎగ్జామ్ కిట్స్, ఫైల్స్ కూడా అందించామని చెప్పారు. పది పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులయితే ఉన్నత చదువులకు సహాయం చేసేందుకు దాతలు చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆలమూరి సాంబశివరావు, దేశ వెంకట శివప్రసాద్, చుండూరు శ్రీధర్, ఎం.నరసింహారావు, కె.శశికాంత్, జూపూడి చంద్రశేఖర్, చక్కా రవికుమార్, ఎస్.జయ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు భానుప్రకాష్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తనకు కోసం వెతకవద్దని, తనకు మంచి జాబ్‌వచ్చిందని లెటర్ రాసి వ్యాపారి అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... తోత్తడి సత్య వెంకట దుర్గ శివ నగేష్ గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో షాపు నంబర్ 217 నందు శ్రీ నగేష్ ఫార్మాస్యూటికల్స్ పేరుతో 8 నెలలుగా షాపు నడుపుతున్నాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లో ఉన్న అతని అక్క లోవకుమారి ఫోన్‌లో మాట్లాడి యోగ క్షేమాలు అడుగగా తాను బాగానే ఉన్నానని సమాధానం ఇచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు శివనగేష్‌తో కలిసి పనిచేసిన ఝాన్సీ అనే ఆమె అతని అక్క లోవకుమారికి ఫోన్ చేసి మీ తమ్ముడు షాపులో లేడని, లెటర్ రాసి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడని తెలిపింది. దుర్గ శివ నగేష్ అక్క మరలా అతనికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. వెంటనే ఆమె భర్తతో కలిసి హైదరాబాద్ నుంచి గొల్లపూడి మార్కెట్‌లోని అతని షాపు వద్దకు వచ్చింది. అతను రాసిపెట్టిన లెటర్ చూసింది. చుట్టుపక్కల వాళ్లను విచారించగా ఆచూకీ తెలియలేదు. దీనిపై తన తమ్ముడు కనిపించడం లేదని భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు జాబ్ వచ్చిందని, తన కోసం వెతక వద్దని లెటర్ రాసి వెళ్లాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవానీపురం వాసి..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యతో గొడవపడి మరో మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం టెలీఫోన్‌కాలనీకి చెందిన దొంతులేశ్వరరావు భార్యతో మనస్పర్థలు వచ్చాయి. కొంత కాలం నుంచి ఆమెకు దూరంగా ఉంటున్నాడు. ఈ సమయంలో దివ్యలక్ష్మి అనే న్యాయవాదితో పరిచయం ఏర్పడడంతో ఆమెతో కలిసి ఉంటున్నాడు. తాగి వచ్చి ఆమెను ఇబ్బందులు పెడుతుండడంతో ఎందుకు తాగుతున్నావంటూ నిలదీసింది. ఆమె మందలించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆమె హైదరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో దొంతిలేశ్వరరావు ఫిబ్రవరి 15న జయదుర్గా లారీ ఆఫీస్ వద్ద తన బైక్, సెల్‌ఫోన్ పెట్టి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయాన్ని పిట్టల సాంబశివరావు అనే వ్యక్తి దివ్యలక్ష్మికి ఫోన్ చేసి చెప్పాడు. ఆమె వచ్చి దొంతులేశ్వరరావు గురించి ఆరా తీయగా ఆచూకీ తెలియలేదు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా ప్రాంగణంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. తొలుత పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా) చౌదరి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ తదితరులు కలిసి దర్గాలోని బాబా సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం పేద ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేయడం అల్లాహ్ పట్ల భక్తికి నిదర్శనమన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో మెలగడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగుల్‌మీరా, అడ్డూరి శ్రీరామ్, బొమ్మసాని సుబ్బారావు, అబ్దుల్ ఖాదర్, దుర్వేసుల హుస్సేన్, దర్గా ముజావర్ల కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, తిరుపతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.